భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల గడువు శుక్రవారంతో ముగియనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శిబిరాలు నిర్వహించినా, వాటిని వినియోగించుకోవడంలో మాత్రం ప్రజలు ఉదాసీనత ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది ఆధార్ నవీకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ తప్పనిసరి. వీటిలో సాంకేతిక తప్పిదాలుంటే అర్హులు సైతం పథకాలకు దూరమయ్యే అవకాశముంది. ఇక ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు తప్పవు.


ఆధార్ నవీకరణకు.. స్పందన అంతంతే..!

ప్రత్యేక శిబిరాలకు నేటితో ముగియనున్న గడువు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 6,06,636 మంది ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంది. అయితే ఐదు నుంచి 15 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్ల వయసున్న వారిలో సుమారు 3,02,818 మంది నవీకరణకు దూరంగా ఉన్నారు. ఆధార్ పొంది పదేళ్లు పూర్తయిన వారు ఆధార్ నవీకరించాల్సి ఉంది. ఇందు కోసం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 88 ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు.


తోలేరులో ప్రత్యేక శిబిరం

ఉమ్మడి జిల్లాలో వేలిముద్రలు నవీకరించుకోవాల్సిన వారు



	పశ్చిమ	ఏలూరు
5-15 ఏళ్లు	48,370	72,688
15-17 ఏళ్లు	68,256	1,13,144

సర్వర్ మొరాయింపు.. మొదటి రోజు పలుచోట్ల సర్వర్ మొరాయించడంతో ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియ ఆలస్యమైంది. 22న తొలి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,125, దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. రెండో రోజు 1,364, మూడో రోజు గురువారం సాయంత్రం 4 గంటల వరకు 980 దరఖాస్తులు నవీకరించారు. 'ఆధార్ నవీకరణకు మొదటి రోజు ఇబ్బందికర సర్వర్ ఆటంకాలు తలెత్తాయి. శుక్రవారంతో శిబిరాలు ముగియనున్నాయి. అవసరం మేరకు ప్రత్యేక శిబిరాల కొనసాగింపును ఉన్నతాధికారులు పరిశీలిస్తారు' అని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

డీఈవోగా వెంకటలక్ష్మమ్మ



ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యా శాఖాధికారిగా ఎం.వెంకటలక్ష్మమ్మ నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం అనకాపల్లి డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏలూరు డీఈవోగా పనిచేస్తున్న ఎస్.అబ్రహంను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పొందుపరిచారు. ఈయన ఆర్జేడీగా ఉద్యోగోన్నతి పొందే జాబితాలో ఉన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం


చంటి బిడ్డకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీ మహేశ్ కుమార్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఏలూరు ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా గురువారం ఒక్కరోజే చిన్నారులకు ఎంపీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

పోలీస్ స్టేషన్‌లోనే పంచాయితీలు

కేసుల నమోదులో అలసత్వం ☛ వివాదాస్పదంగా కొందరు పోలీసుల తీరు



ఈనాడు, ఏలూరు: కొందరు పోలీసుల తీరు మొత్తం ఆ వ్యవస్థకే మచ్చతెస్తోంది. సామాన్యులు న్యాయం కోసం వెళ్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మాని స్టేషన్‌లోనే పంచాయితీలు చేస్తున్నారు. విచారణ చేయకుండా ముడుపులు తీసుకుని పెదరాయుడి తీర్పులిస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజల్లో దిక్కుతోచని దైన్యం ఆవరించింది.

☛ ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి భర్త చనిపోయిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగాయి. సహజీవనం చేస్తున్న మహిళ కొంత మందిని తీసుకెళ్లి అతని భార్య, పిల్లలను కొట్టించారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పైగా కొట్టించిన మహిళ నుంచి రూ.లక్ష వరకు తీసుకుని కేసు నమోదు చేయకుండా ఎదురు కేసు పెడతామని బెదిరించారు. ఈ విషయంలో ఎస్ఐ, ఓ కానిస్టేబుల్ కీలక పాత్ర పోషించారు.

☛ దెందులూరు మండలానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి 2014లో ఈఎంఐ ద్విచక్ర వాహనం పోగొట్టుకున్నారు. అదే వ్యక్తికి చెందిన మరో ద్విచక్ర వాహనాన్ని 2019లో మళ్లీ దొంగిలించారు. రెండు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. ఇటీవల ఏలూరు కండ్రికగూడెంలో బండి దొంగతనం జరిగిందని ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన వ్యక్తి నుంచి తీసుకుని ఓ ఎస్సై దుర్భాషలాడారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఇప్పటి వరకు సుమారు 50 వాహనాలు చోరీకి గురైనా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

☛ భీమవరంలోని ఓ దుకాణంలో పని చేసే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. అతను సాధారణంగా చనిపోయినా పోలీసులు యజమానిపై అనుమానం ఉందని తల్లిదండ్రులతో ఫిర్యాదు చేయించారు. యజమానిని బెదిరించి రూ.2లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన యజమాని రూ.1.25 లక్షలు ఇచ్చారు. ఆ పోలీసు అధికారి ఓ ఏఎస్ఐ, కానిస్టేబుల్‌ను అనుచరులుగా మార్చుకుని నిత్యం ఇదే దందా చేస్తున్నారు.

స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం

మహిళా పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదుల విషయంలో పోలీసుల తీరు దారుణంగా ఉంటోంది. బాధిత మహిళలు ప్రాధేయ పడినా కేసులు కట్టడం లేదన్న విమర్శలున్నాయి. కౌన్సెలింగ్ ముసుగులో పంచాయతీలు చేసి కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన భార్యాభర్తల వివాదంలోనూ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. బాధితురాలు కొన్ని రోజులుగా భర్తపై కేసు నమోదు చేయాలని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని తెలుస్తోంది. స్టేషన్ ఆవరణలోనే భార్య..ఆమె చెల్లెలితోనూ అతను ఘర్షణ పడినా చక్కదిద్దలేదు. చివరికి స్టేషన్‌లోనే యువతి ఆత్మహత్యాయత్నం చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కాసులు దండుకుంటూ..



పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదుల్లో 10-20 శాతం కేసులు కూడా నమోదు కావడం లేదు. రహదారి ప్రమాదాలు, ఘర్షణల్లో గాయాలైన వారు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరతారు. అక్కడ వివరాలు నమోదు చేసి ఆయా స్టేషన్లకు పంపిస్తారు. వీటన్నింటిపైనా పోలీసులు కేసులు నమోదు చేయాలి. కానీ చాలా చోట్ల వారే పంచాయితీలు చేసి కాసులు దండుకుంటున్నారు. ఈ ఘటనల్లో ప్రభుత్వ ఉద్యోగులు నిందితులుగా ఉంటే కేసులు లేకుండా చేసి వారి నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. ఈ తరహా కేసులు ఉభయ జిల్లాల్లో నెలకు దాదాపు 600 వరకు ఉంటే వీటిలో 100 కూడా నమోదు చేయడం లేదని తెలుస్తోంది. ఈ పరిస్థితిపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసుస్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డీఆర్వోగా విశ్వేశ్వరరావు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారిగా వి.విశ్వేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం డీఆర్వోగా పని చేస్తున్న డి.పుష్పమణిని బదిలీ చేశారు. ఆమెను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

వట్లూరు (పెదపాడు), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని డీసీవో భారతి అన్నారు. వట్లూరులోని గురుకుల బాలికల పాఠశాలలో జిల్లాస్థాయి గురుకుల బాలుర, బాలికల పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు పోటీతత్వం పెరుగుతుందన్నారు. విద్యార్థులు రూపొందించిన వివిధ నమూనాలను పరిశీలించారు.

నాలుగింటికే నిధులొచ్చాయ్!

పురపాలక ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు

పాలకవర్గాల్లేని నాలుగు పట్టణాలకు మొండిచేయి

పాలకొల్లు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఏ పురపాలిక చూసినా చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు లేవు. పాలకొల్లు, భీమవరం పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో నేటికీ తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడం లేదు. డ్రెయిన్ల తీరయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పట్టణాలన్నీ చినుకుపడితే చిత్తడిగా మారిపోతున్నాయి. వీధి దీపాల సమస్య ఉండనే ఉంది. వీటిలో ఏ ఒక్క పని చేసుకోవాలన్నా ఆర్థిక సంఘం నిధులు దోహదపడేవి. అయిదేళ్ల వైకాపా పాలనలో ఆర్థిక సంఘం నిధులు సైతం స్వాహా చేయడంతో నిర్వహణ పనులకు దిక్కులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థిక సంఘం నిధుల విడుదల సక్రమంగా జరగక పోవడంతో చిన్న చిన్న పనులు కూడా ఎక్కడికక్కడ పడకేశాయి.


పాలకొల్లులో నిధులు లేక నిలిచిన డంపింగ్‌యార్డు పనులు

ఖాతాలకు జమ..

తాజాగా ఉమ్మడి జిల్లాలోని ఏలూరు నగరపాలిక, నూజివీడు, జంగారెడ్డిగూడెం, నరసాపురం పురపాలక సంఘాలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు 2023-24 ఆర్థిక సంవత్సర తొలి విడత నిధులు జమచేశారు. వాటితో ఆయా పట్టణాల్లో ఉన్న సమస్యలను కొంతవరకైనా పరిష్కరించేలా నిబంధనలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకుంటే పౌరసేవలు మెరుగుపడే అవకాశం ఉంది.

ఏయే పనులంటే..

పట్టణాల్లో తాగునీటి సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, డ్రెయిన్లు, చెత్త సేకరణ వంటి పనులకు ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలి. వీటి తర్వాత ప్రాధాన్య క్రమంలో పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం వంటి పనులకు సాధారణ నిధులకు వీటిని జతచేసి ఉపయోగించవచ్చు. ఇంటింటికీ రక్షితనీరు అందించడానికి కూడా నిధులు వెచ్చించవచ్చు. నిదులొచ్చాక నిరీక్షించకుండా సకాలంలో పనులు చేసి ఆయా నిధులు మురిగిపోకుండా చూసుకోవాల్సి ఉంది.

ఎన్నికలవ్వక నిధులివ్వలే..

ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే ఆయా పురపాలికలకు పాలకవర్గాలుండాలి. పాలకొల్లు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం పురపాలక సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తిగాక ఈ అవకాశం లేకుండా పోయింది. అసలే అంతంతమాత్రంగా నిధులు వస్తున్న ప్రస్తుత తరుణంలో పాలకవర్గాలు లేకపోవడం పెద్ద నష్టమే మిగిల్చింది. పురపాలికలో గ్రామాల విలీన ప్రక్రియపై న్యాయస్థానంలో కేసులు వేయడంతో ఈ సమస్య ఏర్పడింది.



జంగారెడ్డిగూడెం	1.71
నూజివీడు	1.30
నరసాపురం	1.97
ఏలూరు	47.0

పురపాలక శాఖ రాజమహేంద్రవరం ఆర్డీ నరసింహారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పాలకవర్గాలు లేని పురపాలికలకు ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించడానికి ప్రయత్నిస్తోందన్నారు.

ఉచిత ఇసుక విధానానికి కట్టుబడిన ప్రభుత్వం: మంత్రి


వలసపల్లిలో ఉచిత ఇసుక రీచ్ ప్రారంభిస్తున్న పార్థ సారథి

ముసునూరు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక సరఫరాకు నిర్దేశించిన పాలసీకి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ముసునూరు మండలం వలసపల్లి, యళ్లపురం గ్రామాల్లో ఉచిత ఇసుక రీచ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అక్రమ రవాణా నిరోధించి నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. సీనరేజీ, డీఎంఎఫ్ మెరిట్ ఫీజుకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలు ఎవరైనా తమ గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సొంతగా ట్రాక్టర్లు తీసుకెళ్లి తెచ్చుకోవచ్చని చెప్పారు. స్థానికంగా ఎప్పటి నుంచో ఇసుక ఎగుమతిపై జీవనోపాధి చేసుకుంటున్న కార్మికులు లోడింగ్ ఛార్జీల కోసం రూ.400 కోరారన్నారు.

లారీలో లోడ్ చేస్తే చర్యలు... ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్లి లారీల్లో లోడింగ్ చేయడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా, అధిక ధరకు ఇసుకను విక్రయించినా అటువంటి వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని చెప్పారు. ఆర్డీవో ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అగ్రపథంలో నిలిపేందుకు కృషి


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బీసీలను అన్ని రంగాల్లో అగ్రపథంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. ఏలూరు చొదిమెళ్లలోని ఎంజేపీ గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలతో పాటు వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. భోజన, వసతి సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు శాశ్వత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 107 గురుకుల పాఠశాలలుంటే వాటిలో 105 తెదేపా హయాంలో ఏర్పాటు చేసినవేనన్నారు. గురుకుల పాఠశాలల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి ఏలూరు నగర సమీపంలో సుమారు 10 ఎకరాల స్థలాన్ని సేకరిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పుష్పమణి, బీసీ సంక్షేమ అధికారిణి నాగరాణి, తహసీల్దార్ శేషగిరి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారసింహం.. నయన మనోహరం


వటివేళ్ల అలంకరణలో ఉత్సవ మూర్తులు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహ వాహనంపై స్వామి వైభవంగా ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి యోగనరసింహ అలంకరణలో తిరువీధుల్లో విహరించడంతో భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో తాను సింహ సమానంతో ప్రయత్నిస్తానన్న శ్రీవారి సందేశాన్ని ఈ సందర్భంగా పండితులు వినిపించారు. మహాస్నపన, ప్రధాన హోమాలు, తిరుప్పావడ సేవ, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.


తిరుప్పావడ సేవలో అర్చకులు, ప్రజాప్రతినిధులు

చిరుత.. ఇంకా చిక్కలేదు

జగన్నాథపురం పొలాల్లో అడుగు జాడలు


పెదవేగి మండలం జగన్నాథపురంలో చిరుత అడుగులను పరిశీలిస్తున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు

పెదవేగి, భీమడోలు, న్యూస్‌టుడే: కొన్ని రోజులుగా భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో కనిపించిన చిరుత తాజాగా పెదవేగి మండలం జగన్నాథపురంలోని పంట పొలాల్లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు గురువారం ప్రకటించారు. అటవీ శాఖ ఏలూరు రేంజర్ కుమార్, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై కె.రామకృష్ణలు తమ సిబ్బందితో జగన్నాథపురం వెళ్లి అడుగులను పరిశీలించారు. అవి చిరుతవే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి శివారు ఆంజనేయ నగరం ప్రాంతంలో కూడా చిరుత కాలి గుర్తులు కనిపించడంతో పోలవరం కుడి కాలువ గట్టు వెంబడి అటువైపు వెళ్లి ఉంటుందని అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు. గ్రామానికి చెందిన బాబి బుధవారం రాత్రి తన పంట పొలాల వద్దనున్న కోళ్ల ఫారం వద్ద నుంచి ఇంటికి బయలుదేరారు. రహదారిలో చిరుత నిద్రిస్తూ కనిపించడం చూసి గ్రామానికి వచ్చి స్థానికులకు తెలిపారు. గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు పెదవేగి సీఐ, అటవీ శాఖ ఏలూరు రేంజర్‌కు సమాచారమిచ్చారు. వారు గురువారం ఉదయం జగన్నాథపురం వచ్చి కాలి అడుగుల్ని పరిశీలించి చిరుతవిగా నిర్ధారించారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని రేంజర్ కుమార్ తెలిపారు.



భూసేకరణలో యజమానులకు న్యాయం చేస్తాం: జేసీ


మ్యాప్‌లను పరిశీలిస్తున్న ధాత్రిరెడ్డి

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకు నిర్మించనున్న 365 బీబీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులు, యజమానులకు సముచిత పరిహారం చెల్లించి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తామని జేసీ ధాత్రిరెడ్డి అన్నారు. జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయంలో రైతులు, అధికారులతో గురువారం సమావేశమై భూసేకరణకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహాన్ని సందర్శించారు. కామయ్యపాలెంలోని వన్‌ధన్ వికాస కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

కీలక శాఖలో ఖాళీల వెక్కిరింత

ఇన్‌ఛార్జుల ఏలుబడిలో రెవెన్యూ ★ చాలాచోట్ల తహసీల్దార్లుగా డీటీలకు అదనపు బాధ్యతలు

పెదవేగి, ఉంగుటూరు, న్యూస్‌టుడే: సాధారణ ఎన్నికల అనంతరం తహసీల్దార్లను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి వారి జిల్లాలకు పంపించింది. ఉంగుటూరు తహసీల్దారు కట్టా వెంకటశివయ్య కృష్ణా జిల్లాకు వెళ్లిపోయారు. ద్వారకాతిరుమల తహసీల్దారు సతీష్ వచ్చారు. నెల రోజుల్లోపే ఆయన సీఆర్‌డీఏకి బదిలీ అయ్యారు. ఆగస్టు 28 నుంచి ఉప తహసీల్దార్లు అదనపు బాధ్యతలతో నెట్టుకొస్తున్నారు.



ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ సేవలపై ప్రజలు సంతృప్తి చెందారంటే అధికారి యంత్రాంగం పని తీరు బాగున్నట్లే అని భావిస్తారు. అయితే జిల్లాలోని పది మండలాల్లో తహసీల్దార్లు లేకపోవడంతో ఉప తహసీల్దార్లు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో సకాలంలో సేవలందకపోవడంతో అర్జీదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

28 మండలాల్లో 10 చోట్ల డీటీలే.. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో 10 మండలాలకు ఉప తహసీల్దార్లే అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఉంగుటూరు, పెదవేగి, ఏలూరు గ్రామీణ, కైకలూరు, మండవల్లి, జీలుగుమిల్లి, టి.నరసాపురం, కుక్కునూరు, నూజివీడు, ముసునూరు మండలాల్లో డీటీల పాలన కొనసాగుతోంది. కార్యాలయాల్లో దస్త్రాలు తయారు చేయడం, సరిచూడటం వంటి పనులతో పాటు పరిపాలన, క్షేత్రస్థాయి పరిశీలన, పర్యవేక్షణ తదితర అదనపు బాధ్యతలు మోయాల్సి రావడంతో పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. ఇన్‌ఛార్జి బాధ్యతలు కావడంతో త్వరితగతిన నిర్ణయాలకు వెనకాడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికలు, భూముల రీసర్వే, గ్రామ సభలు, ధాన్యం సేకరణతోపాటు తాజాగా సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయూఏ) ఎన్నికల ప్రకటన ఈ నెల 21 విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణలో ప్రధాన పాత్ర తహసీల్దార్లదే కావడంతో పని ఒత్తిడి మరింత పెరగనుంది.

ఉద్యోగోన్నతి విషయమై కోర్టుకు.. రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఖాళీలు ఏర్పడ్డాయి. డీటీలకు తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలి. ఉద్యోగోన్నతి విషయంలో తమకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ గ్రూపు-2 ద్వారా ఎంపికైన డీటీలు కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా ఉద్యోగోన్నతుల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పాలన కుంటుపడకుండా చర్యలు తీసుకుంటామని, తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నకిలీ బంగారం కుదవ పెట్టి.. రూ. లక్షలు కాజేసి 8లో

ఆసుపత్రి సందర్శన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) అధికారుల బృందం గురువారం సందర్శించింది. ఆసుపత్రి నిర్వహణ, వైద్య విభాగాలు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు.

గ్రామీణ విద్యార్థులు.. క్రీడల్లో మెరికలు

క్రీడా వాణి

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే

వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులు. పేద, మధ్య తరగతి నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. గెలవాలనే తపన, ఆసక్తితో క్రీడల్లో రాణిస్తున్నారు. క్రీడలకు అనువైన వసతులు లేకున్నా ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ వ్యాయామ ఉపాధ్యాయినుల తర్ఫీదుతో ఆటల్లో రాణిస్తున్నారు. నారాయణపురం, కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల పాఠశాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



ఉచితంగా వైద్య సేవలందిస్తా..



'నేను నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మా నాన్న ప్రసాద్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ నన్ను చదివిస్తున్నారు. ఇటీవల తణుకులో జరిగిన జిల్లా స్థాయి షటిల్ పోటీల్లో అండర్-17 విభాగంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యా. వైద్య విద్య అభ్యసించి భవిష్యత్తులో పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తా' అని బట్టు గ్లోరి తెలిపారు.

క్రీడా కోటాలో కొలువు లక్ష్యం



'కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. నా తల్లిదండ్రులు వెంకటేష్, మోహన వ్యవసాయ కూలీలు. వరుసగా రెండోసారి యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యా. ఈసారి బాగా కష్టపడి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై అక్కడా రాణిస్తా. క్రీడల కోటాలో కొలువు సాధించాలన్నదే నా ధ్యేయం' అని పాతినించి షణ్ముక నాగరాజు పేర్కొన్నారు.

సత్తా చాటుతా



'కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. మా అమ్మానాన్నలు శ్రీను, అమరావతి కూలి పనులు చేస్తూ కష్టపడి నన్ను చదివిస్తున్నారు. గతేడాది జిల్లా స్థాయి పోటీల్లో కొద్దిపాటి తేడాతో ఓటమి చెందా. రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యా. ఈసారి సత్తా చాటుతా. పోలీసు శాఖలో కొలువు సాధించడమే నా లక్ష్యం' అని ఉప్పాడ రేవంత్ వసంత్‌కుమార్ వివరించారు.

జాతీయ స్థాయి క్రీడాకారిణినవుతా



'నేను కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నా తల్లిదండ్రులు దుర్గారావు, వెంకటలక్ష్మి వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. నాకు వాలీబాల్ ఆటపై ఉన్న ఆసక్తిని గమనించిన పీడీలు పాపాయమ్మ, నాగసుధలు తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహించారు. గతేడాది జిల్లా స్థాయి వరకు వెళ్లాను. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యా. వాలీబాల్‌లో జాతీయ స్థాయి క్రీడాకారిణి అవ్వాలన్నదే నా లక్ష్యం' అని పుప్పాల లిఖిత తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచి, ప్రధానోపాధ్యాయుడు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు గురువారం తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22న ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మన్యం ఆంజనేయులు 3 వేల మీటర్ల పరుగులో ప్రథమ, 1500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఉల్లిబోయిన మేరి షాట్‌పుట్‌లో ద్వితీయ, అండర్-14 విభాగంలో సుభాష్ హైజంప్‌లో ప్రథమ, మనోజ్ 200 మీటర్ల పరుగులో ప్రథమ, కాటి దీవెనకుమార్ 100 మీటర్ల పరుగులో తృతీయ, దేవకీ ప్రియాంక హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు..

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు జంగారెడ్డిగూడెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మానికల సుధారాణి ఎంపికైంది. ఈ నెల 23 వరకు హిందూపురంలో జరిగిన అండర్-17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సుధారాణి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.

29 నుంచి సివిల్ సర్వీసు ఉద్యోగులకు..

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం మైదానంలో ఈ నెల 29 నుంచి జిల్లా స్థాయి ప్రభుత్వ సివిల్ సర్వీసు ఉద్యోగుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ముఖ్య శిక్షకుడు శ్రీనివాసరావు తెలిపారు. 29న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, బాస్కెట్‌బాల్, చదరంగం, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, 30న హాకీ, కబడ్డీ, టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రెజ్లింగ్, స్విమ్మింగ్, మ్యూజిక్, డ్యాన్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఉద్యోగులు 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యేవారు వచ్చే నెల 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వేతన బకాయిల కోసం ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. త్వరలో సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. కాగా, సంబంధిత గుత్తేదారు వేతన బకాయిలు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

మన్యంలో మరో ఏకలవ్య విద్యాలయం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతంలో మరో గిరిజన గురుకుల ఏకలవ్య విద్యాలయాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ అన్నారు. బుట్టాయగూడెం మండలం విప్పలపాడు వద్ద ఉన్న ఏకలవ్య విద్యాలయాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. రూ.2 వేల కోట్లతో పోలవరంలో నౌకాదళ ఆయుధగారం ప్రాజెక్ట్ ఏర్పాటుకు కేంద్రం సముఖంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ఏకలవ్య విద్యాలయాలు విజయవంతంగా నిర్వహిస్తూ, సత్ఫలితాలు సాధిస్తుండటంతో పోలవరం నియోజకవర్గంలో మరో విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందుకు కేంద్రం నుంచి సూచనలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ.. మన్యం గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులతో ఉత్తమ భవిష్యత్తును సాధించాలన్నారు. ఇప్పలపాడుకు చెందిన గిరిజనులు పలు సమస్యలను ఎంపీకి విన్నవించి పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీ బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

నేటి నుంచి పశుగణన

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు 21వ అఖిల భారత పశుగణన నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు తెలిపారు. సిబ్బంది జిల్లాలోని గడపగడపకెళ్లి సమాచారం సేకరిస్తారన్నారు. పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పనకు సమగ్ర సమాచారం అవసరమని, పశుగణన దేశమంతటా ప్రతి అయిదేళ్లకు ఒకసారి నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి సంబంధించి 227 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. పశుగణన ఆన్‌లైన్లో జరుగుతుందన్నారు. మీ ఇంటికి వచ్చే విషయ సేకరణదారుకు పశువులు, పెంపుడు జంతువుల సమగ్ర సమాచారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న మహేశ్ కుమార్



హాజరైన అధికారులు

పేదలకు కార్పొరేట్ వైద్యం: ఎంపీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది జవాబుదారీగా పని చేయాలని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన జిల్లా సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించే దిశగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు వెంటనే చికిత్స అందించాలని వైద్యుల్ని ఆదేశించారు. వైద్య సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాల కొరత నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే రూ.4 కోట్లతో వైద్య పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అత్యవసర విభాగాల్లో డిప్యుటేషన్‌పై సిబ్బందిని నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య పరికరాలకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తం యూనిట్లు ఉచితంగా అందించాలని ఆదేశించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. రోగులకు సక్రమంగా వైద్యం అందించేలా వైద్యులు, సిబ్బంది పనిచేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.పాల్ సతీశ్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు పోటీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి గ్రామ పంచాయతీలకు పోటీ నిర్వహిస్తున్నారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 26న దిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సర్పంచులను సత్కరిస్తారన్నారు. దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఇద్దరేసి చొప్పున సర్పంచులను ఎంపిక చేసి సత్కరిస్తారని వివరించారు. జిల్లాలోని సర్పంచులు, పంచాయతీల సిబ్బంది కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి సారించాలని సూచించారు. నవంబరు 30వ తేదీ నాటికి సంతృప్తి స్థాయిని పొందేలా పోటీతత్వంతో పనిచేయాలన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఉత్తమ సర్పంచుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 పథకాలను ఆయా గ్రామాల్లో అమలుచేసి లబ్ధిదారులు సంతృప్తి చెందేలా చేయడాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించిన ముగ్గురు అంతర్రాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరులోని ఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసు శాఖలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తున్న అనుమానితుల కదలికలను ట్రాక్ చేసి ద్విచక్ర వాహనాలు చోరీ చేసే తెలంగాణ రాష్ట్రానికి ముగ్గురు సభ్యుల ముఠాను పట్టుకున్నామన్నారు. గతేడాదిగా వీరు నూజివీడు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, ఎ.కొండూరు 1, మచిలీపట్నం 1, మైలవరం 2, తిరువూరు 1, ఒంగోలు 1, విజయవాడ కృష్ణలంక 2, సత్తుపల్లి 1, చింతలపూడి స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాలను చోరీ చేశారన్నారు. నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి నూజివీడు రామన్నగూడెం రోడ్డులోని రాజీవ్ సర్కిల్ వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని ఆపి విచారణ చేయగా ఈ నేరానికి పాల్పడింది వారేనని తెలిసిందన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

నిందితులు వీరే.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుకు చెందిన బత్తుల పవన్ కల్యాణ్, సత్తుపల్లిలో బీకాం కంప్యూటర్స్ చదివాడు. అనంతరం చదువు ఆపేసి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మరో నిందితుడు అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డి సీతారామరెడ్డి 9వ తరగతి వరకు చదివి మెకానిక్ పనులు చేస్తుంటాడు. మూడో నిందితుడు అదే మండలం దూళ్లకొత్తూరుకు చెందిన దనికొండ రమేష్ కాంట్రాక్టు వర్కరుగా పని చేస్తూ ఓ మద్యం బెల్టు షాపు కూడా నిర్వహిస్తున్నాడు. పవన్ కల్యాణ్, రమేష్ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. డబ్బులు సులభంగా సంపాదించాలని సీతారామిరెడ్డిని కలుపుకొని చోరీలకు పాల్పడుతున్నారు.

దిగొచ్చిన నిమ్మధర..!



నాణ్యతను బట్టి గురువారం కిలో నిమ్మకాయల ధర రూ.30 నుంచి 50వరకూ ఉందని ఆ వర్తకసంఘం అధ్యక్షులు చక్రపాణి తెలిపారు. ఏలూరు మార్కెట్ యార్డులో నిత్యం 25 నుంచి 30 లారీలు ఎగుమతయ్యేవని, ప్రస్తుతం 5 లారీలు మాత్రమే ఎగుమతి చేస్తున్నామన్నారు. - **ఈనాడు, ఏలూరు**

ఒప్పంద ఉద్యోగి అవినీతిపై ప్రచారం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఓ ఒప్పంద ఉద్యోగి అవినీతిపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో డీసీపీయూ కార్యాలయంలో ప్రొటెక్షన్ అధికారి(నాన్ ఇన్‌స్టూషనల్ కేర్), ఎస్‌ఏఏలో సోషల్ వర్కర్ (మహిళ), ఎస్‌ఏఏలో పార్ట్‌టైం వైద్యుడు, ఆయా, నూజివీడు బాలసదనంలో ఎడ్యుకేటర్ (పార్ట్‌టైం), నూజివీడు, దెందులూరు బాలసదనాల్లో ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజికల్ ఉపాధ్యాయులు, పీటీ, యోగా ఉపాధ్యాయులు (పార్ట్ టైం) ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 18న ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. అయిదుగురు సభ్యుల కమిటీ ఇంటర్వ్యూలు చేసింది. కమిటీ సభ్యులు అభ్యర్థులకు మార్కులు కేటాయిస్తారు. ఈ కమిటీలో ఆ ఒప్పంద ఉద్యోగి కూడా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. మార్కులను పెన్నుతో కాకుండా పెన్సిల్‌తో నమోదు చేయడంపై అభ్యర్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మౌఖిక పరీక్షలు జరిగి వారం కావస్తున్నా ఇప్పటివరకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడికాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ ఉద్యోగాల ఎంపికలో సదరు ఒప్పంద ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హతలు కలిగిన అభ్యర్థులను కాకుండా తనకు అనుకూలమైన వారిని ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే పథకానికి సంబంధించి గతేడాది జరిగిన ఇంటర్వ్యూల్లో అకౌంటెంట్, శిశుగృహ మేనేజర్ పోస్టులకు సదరు ఒప్పంద ఉద్యోగి ముడుపులు తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. అలాగే దత్తత ప్రక్రియలోనూ అనేక అవకతవకలు జరిగినట్లు.. రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ విషయాలపై కలెక్టర్, ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేసి సదరు ఒప్పంద ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని బాధిత అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నకిలీ బంగారం కుదవ పెట్టి.. రూ.లక్షలు కాజేసి

పనిచేస్తున్న కంపెనీకే ఉద్యోగి కుచ్చు టోపీ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: స్నేహితులు, సిబ్బంది సహకారంతో తాను పనిచేసే కంపెనీకే కుచ్చు టోపి పెట్టి రూ.లక్షలు కాజేశాడు ఆ ఉద్యోగి. ఉన్నతాధికారుల పరిశీలనలో ఉద్యోగి బండారం బయట పడటంతో సదరు ఉద్యోగితో పాటు సహకరించిన వారు పరారవ్వడంతో చేసేదేమీ లేక కంపెనీ ప్రతినిధులు జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎన్.దుర్గాప్రసాద్ స్థానిక కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచి మేనేజరుగా కొంత కాలంగా పనిచేస్తున్నారు. అతడితో పాటు అదే ప్రాంతానికి చెందిన టి.నాగబాబు సైతం కంపెనీలో క్యాషియర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే దుర్గాప్రసాద్ తను పనిచేస్తున్న కాలంలో పలు రకాల నకిలీ బంగారు వస్తువులను కంపెనీలో కుదవ పెట్టి రూ.23 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు కంపెనీ క్యాషియర్ నాగబాబుతో పాటు దుర్గాప్రసాద్ స్నేహితులు ఎన్.శ్రీనివాస్, మురళీ సహకరించారు. కంపెనీ ఏరియా మేనేజరు హేమంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

వివాహితపై కత్తితో దాడి : కేసు నమోదు

తాళ్లపూడి, న్యూస్‌టుడే : వివాహితపై కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం... దెందులూరుకు చెందిన ఆరేపల్లి హరినాథ్ గురువారం తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన ఓ వివాహిత ఇంటికి వచ్చాడు. భర్త, బావ సమక్షంలోనే వివాహితను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి తలుపు గడియపెట్టేందుకు ప్రయత్నించగా ఆమె బావ అడ్డగించారు. దీంతో హరినాథ్ వెంట తెచ్చుకున్న చాకుతో ఆమె గొంతు కోయడానికి ప్రయత్నించగా బావ అడ్డుపడటంతో ఆయన బొటనవేలుకు గాయమైంది. చాకుతో వివాహిత పొట్టలో పొడిచాడు. ఆమె పెద్దగా కేకలు వేయగా పరిసరాల్లోని వారు అక్కడికి చేరుకోవడంతో హరనాథ్ అక్కడ నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెట్టినట్లు ప్రధానాచార్యుడు జి.గిరిబాబు తెలిపారు. గృహోపయోగ వస్తువుల తయారీపై కోర్సు ప్రారంభించేందుకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అభ్యసించే వారు భవిష్యత్తులో వ్యాపారవేత్తగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కోర్సును సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కోర్సు సమన్వయకర్త, రసాయన శాస్త్ర అధ్యాపకుడు కె.రమేశ్, ఉప ప్రధానాచార్యుడు ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలని వినతి.. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఆ కళాశాల ప్రతినిధులు ఏలూరు ఎంపీ మహేశ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యుడు గిరిబాబు మాట్లాడుతూ కళాశాలకు సొంత భవనాల నిర్మాణానికి ఎంపీ నిధులు లేదా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీకి వినతి పత్రం అందజేసిన వారిలో ఉప ప్రధానాచార్యుడు ఎం.రాంబాబు, సీడీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఎంపీ మహేశ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కళాశాల ప్రతినిధులు

నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

నిడమర్రు, న్యూస్‌టుడే: పత్తేపురం- తోకలపల్లి రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. ఈ నెల 25న పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొంటారు. దీని నిర్మాణంతో పత్తేపురం, ఆముదాలపల్లి, బైనేపల్లి, తోకలపల్లి గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం, న్యూస్‌టుడే: ఆధార్ శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి దోసిరెడ్డి అన్నారు. గణపవరం సచివాలయం-2లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం రెవెన్యూ రీసర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. చినరామచంద్రపురం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న దోసిరెడ్డి

దెందులూరు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: శాతవాహననగర్‌లోని ఎన్‌టీఆర్ఈఏపీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చాలాకాలం నుంచి చెత్త, వ్యర్థాల నిల్వలు తొలగించడం లేదు. చెత్త పేరుకుపోయి పందులు, దోమలు, విషపురుగులకు ఆవాసంగా మారింది. వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. **- కృష్ణ ప్రసాద్, శాతవాహననగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి చెత్త నిల్వలు తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేస్తాం.

- చంద్రయ్య, నగర అదనపు కమిషనర్

సమస్య: శనివారపుపేటలోని శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో పైపు లైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. కొద్దిపాటి వర్షానికి మురుగు, వర్షపునీరు పైపులోకి చేరి తాగునీరు కలుషితమవుతోంది. **- విశ్రాంత తహసీల్దార్ చంద్రశేఖర్, శ్రీరామ్‌నగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయిస్తాం. **- సత్యనారాయణ, తాగునీటి నిర్వహణ డీఈ**

నిడమర్రు, న్యూస్‌టుడే

సమస్య: పెదనిండ్రకొలనులో మైక్రో వాటర్ ఫిల్టర్లు పని చేయడం లేదు. శుద్ధి జలం అందక ఇబ్బందులు పడుతున్నాం.

- నాగేశ్వరరావు, పెదనిండ్రకొలను

సమాధానం: వాటిని బాగు చేసి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తాం. **- రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, నిడమర్రు**

అంతిమ యాత్రకూ అవస్థలే!

శ్మశాన వాటికల్లో సదుపాయాలు కరవు

దెందులూరు మండలం గాలాయగూడెంలో ఐటీసీ నిర్వహించిన 'మిశన్- మీ చింతమనేని' కార్యక్రమంలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ప్రభాకరకు వివరించారు. తక్షణమే ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

దెందులూరు, ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అంతిమ యాత్రకు అవస్థలు తప్పడం లేదు. మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు కనీస సదుపాయాలు లేవు. ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లో కొన్ని చోట్ల కొల్లేరు తీర ప్రాంతాల్లో కార్యక్రమాలు జరపాల్సి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరు లంక గ్రామాల్లోని చిన్న భూములు ఆక్రమణకు గురి కావడంతో ఎవరైనా మృతి చెందితే కొల్లేరు లోపలున్న కొద్దిపాటి ఖాళీ స్థలాల్లో ఖనన, దహన సంస్కారాలు చేపడుతున్నారు.



జాలిపూడిలో శ్మశాన వాటిక ఇలా..

రహదారులు, షెడ్లు లేవు

మహేశ్వరపురం, మానూరు, శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక, గుడివాకలంక, యాగనమిల్లి, కొక్కిరాయిలంక, కోమటిలంక, కలకుర్రు తదితర ప్రాంతాల్లో శ్మశాన వాటికలకు వెళ్లేందుకు రహదారి, నీరు, షెడ్ల సదుపాయాలు లేవు. ఇళ్లకు ఎక్కువగా మృతదేహాలను ఖననం చేస్తారు. ఇందుకు భూమిని కొంత మేర తవ్వుతుండగానే నీరు ఊరి వస్తోంది. వర్షాకాలంలో ఇక చెప్పే పనే లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొల్లేరు పొంగి పొర్లి లంక గ్రామాలు జలమయమయ్యాయి. శ్మశాన వాటికలు నీట మునిగాయి. లంక గ్రామాల్లో చాలావరకు రుద్రభూమి ఆక్రమించి చేపల చెరువులు తవ్వారు. ఫలితంగా వర్షపు నీరు, వరద వెళ్లే దారి లేక శ్మశాన వాటికలు చెరువులను తలపిస్తున్నాయి. జాలిపూడిలో బాబుజాన్‌గూడెం వెళ్లే రోడ్డులోని మైదాన ప్రాంతంలో మృతదేహాలకు దహన సంస్కారాలు చేస్తున్నారు. అప్పుడు వర్షం కురిస్తే మృతుని బంధువులు పడే వేదన అంతా ఇంతా కాదు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా గ్రామాల్లో నేటికి స్వర్గధామాలకు సరైన మౌలిక సదుపాయాలు సమకూర్చక పోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వంలోనైనా వీటికి మోక్షం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.



మానూరు వెళ్లే దారిలో నీట మునిగి..

ప్రతిపాదనలు పంపుతాం

ఎస్సీ సబ్ ప్లాన్‌లో శ్మశాన వాటికలకు ప్రహరీల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు దెందులూరు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటికల్లోని ముళ్ల చెట్లు, పొదలు తొలగించి శుభ్రం చేయిస్తామన్నారు. ఏలూరు ఎంపీడీవో శ్రీలత మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు లేని శ్మశాన వాటికలను గుర్తించి.. నిధుల లభ్యతను బట్టి అభివృద్ధి చేస్తామన్నారు.

వెల్లివిరిసిన ప్రతిభ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను గుర్తించేందుకు 'ఈనాడు' నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కస్తూర్బా నగర పాలక బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీ నిర్వహించారు. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. అంతర్జాలాన్ని అవసరం మేరకే వినియోగించుకోవాలని లేదంటే అనర్థాలు తప్పవని, సామాజిక మాధ్యమాల్లో మంచిని మాత్రమే గ్రహించాలంటూ విద్యార్థినులు చక్కని సందేశాన్ని ఇచ్చారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పి.పద్మసుశీల, పి.పద్మకుమారి, వి.రమాదేవి, కె.రంగవేణి, ఎల్.నాగలక్ష్మి వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయిని జి.సునీత బహుమతులు ప్రదానం చేశారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



విజేతలతో ప్రధానోపాధ్యాయిని సునీత, ఉపాధ్యాయినులు

విజేతలు వీరే:
ప్రథమ - పి.కావ్య,
ద్వితీయ - పి.సుజనీ,
తృతీయ - ఎ.పూర్ణచంద్రిక

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టడంతో పాటు నాణ్యతతో ఎక్కడా రాజీ పడొద్దని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో జలవనరులు, డ్రెయిన్లు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మత్స్య శాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వరద నివారణ నిధులు త్వరలో మంజూరవుతాయన్నారు. మురుగు బోదెల్లో పూడిక తీత పనులు చేపట్టి ముంపు సమస్యను అరికట్టాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో రైతులను భాగస్వాములను చేయడంతో పాటు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో నూరు శాతం సీసీ రోడ్లు నిర్మించడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. సిజీ రహదారి నుంచి కాగుపాడు, ఉంగుటూరు, అలాగే నల్లజర్ల- లక్ష్మీనగరం మార్గంలో మండల పరిధిలోని ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కోళ్ల వ్యర్థాలు వినియోగించే చేపల చెరువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయా శాఖల డీఈలు, ఏఈలు, ఎఫ్‌డీవోలు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు, అధికారులు

నైపుణ్యాలను ఒడిసిపట్టుకోవాలి.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను ఒడిసిపట్టుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. నారాయణపురంలోని శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సేవల విభాగం, సెట్‌వెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మేళాకు మొత్తం 80 మంది యువతీ యువకులు హాజరు కాగా 11 మంది ఎంపికయ్యారని ప్రధానాచార్యుడు టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. సెట్‌వెల్ సీఈవో కె.ప్రభాకర్‌రావు, జిల్లా ఉపాధి అధికారి సి.మధుభాస్కరరావు, ఎన్‌సీఎస్ యంగ్ ప్రొఫెషనల్ గట్టిం ప్రవీణ్‌కృష్ణ, సెట్‌వెల్ ఏవో జాన్ కెనడీ, కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ అధికారి కొండా రవి పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: దోమల నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. డీఎంహెచ్‌వో శర్మిష్ఠ ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి పి.ఎస్.ప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బంది నగరంలోని మురికికుంటల్లో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమల గుడ్లను ఆహారంగా తీసుకుంటాయన్నారు. తద్వారా దోమల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు మండలం పోలసానిపల్లిలో గురువారం దోమల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటూ ప్రచారం చేపట్టారు. గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తనూజ, సీహెచ్‌వో ఇందిర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు సరఫరా నిలిపివేత

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: బువ్వనపల్లి, నిడమర్రు విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. వాటి పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నగర పాలక పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను డిప్యుటేషన్ విధానంలో సర్దుబాటు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ సంఘం జిల్లా కోశాధికారి బి.రాము, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, జి.సాయి శ్రీనివాసరావు తదితరులు గురువారం ఏలూరు ఎంఈవో-1 రవిప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 8 పాఠశాలల్లో ఆయిదు తరగతులకు ఇద్దరేసి ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు భవిష్య నిధి వెంటనే చెల్లించాలని కోరారు.

కౌలు రైతులకు ప్రభుత్వం అండ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కౌలు రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ అన్నారు. గురువారం ఆయన అమరావతి నుంచి కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యాన అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకర్ల సహకారంతో కౌలు రైతులకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తామన్నారు. పంట సాగు హక్కు పత్రంపై అంగీకారం తెలిపిన భూయజమానులకు పంట రుణాలు మంజూరు చేయకపోతే కౌలు రైతులకు అందేలా చూస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తుకు తరచూ అంతరాయం

ఇబ్బందుల్లో ప్రజలు

పవరుపేట, ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని పవరుపేటలో విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. కొద్ది రోజులుగా వేళాపాళా లేకుండా సరఫరా నిలిపివేస్తున్నారు. కొన్నిసార్లు వరుసగా మూడు రోజులపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో గంట నుంచి రెండు గంటల పాటు విద్యుత్తు ఉండటం లేదు. రెండు రోజుల కిందట ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలుమార్లు సరఫరా నిలిచిపోయి పావు గంట, అర గంట తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. మంగళవారం మధ్యాహ్నం వాన కురవడం ప్రారంభం కాగానే కరెంటు నిలిచిపోయింది. అంతకు ముందు రోజు కూడా దాదాపు రెండున్నర గంటల పాటు సరఫరా లేదు. పవరుపేటలో మాత్రమే ఎందుకు ఇలా జరుగుతోందనే సందేహం ఆ ప్రాంత వాసులకు కలుగుతోంది. పవరుపేటలోని నాలుగైదు వీధులకు సంబంధించిన విద్యుత్తు పరివర్తకం వల్లూరి వారి వీధిలో ఉంది. ఇది ఏర్పాటు చేసి ఏళ్లు కావడంతో అధిక విద్యుత్తు వినియోగాన్ని తట్టుకోలేని స్థితికి చేరుకుంది. తరచూ మరమ్మతులకు గురవుతున్నందున సిబ్బంది వచ్చి గంటల తరబడి మరమ్మతులు చేస్తుంటారు. విద్యుత్తు సరఫరా నిలిచినప్పుడు రామకృష్ణాపురంలోని విద్యుత్తు ఉప కేంద్రానికి ఫోన్ చేస్తే సరిగా సమాధానం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గంటల తరబడి సరఫరా నిలిచినప్పుడు ఉప కేంద్రంలోని ఫోన్ కూడా పనిచేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఏపీఈపీడీసీఎల్ ఏఈ పద్మిని మాట్లాడుతూ మూడు రోజుల కిందట విద్యుత్తు సరఫరా ప్రధాన కేంద్రంలో నెలకొన్న అంతరాయం కారణంగా సరఫరా కొన్ని గంటలపాటు నిలిచిందన్నారు. వర్షాకాలంలో ఎక్కడైనా విద్యుత్తు తీగలు ట్రిప్ అయితే సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. తీగలపై చెట్టు కొమ్మలు విరిగి పడినప్పుడు సరఫరా నిలిచిపోతుందన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తినప్పుడు సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే వచ్చి పరిష్కరిస్తారని తెలిపారు. రామకృష్ణాపురంలోని విద్యుత్తు ఉప కేంద్రానికి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తామని వివరించారు.

శివగోపాలపురంలో సమస్యల తిష్ఠ

తంగెళ్లమూడి, ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రధాన ప్రాంతమైన తంగెళ్లమూడి పరిధిలోని శివగోపాలపురంలో సమస్యలు తిష్ఠ వేశాయి. రహదారులు పూర్తిగా అధ్వానంగా మారడంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సాయి మందిరం ఎదురుగా ఉన్న రహదారి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడి విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం చాలాకాలం నుంచి వెలగడం లేదని స్థానికులు అంటున్నారు. రాత్రివేళ రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటోందని చెబుతున్నారు. నివాసాల మధ్యనున్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. చిన్నపాటి వర్షానికే వాటిల్లో నీరు నిలిచిపోతోంది. ఫలితంగా దోమల ఉద్ధృతి ఎక్కువగా ఉంటోంది. ఇది చాలదు అన్నట్లు కొందరు ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారు. దీనివల్ల భరించలేని దుర్వాసన వస్తుండటంతో సమీప గృహాల వారి ఇక్కట్లు వర్ణనాతీతం. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ శివగోపాలపురంలోని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాళీ స్థలాల్లో ఇలా..



సాయి మందిరం ఎదురుగా ఉన్న రహదారి దుస్థితి

పీఎంపీల సేవలు అభినందనీయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అమరులైన పోలీసుల సేవలను గౌరవిస్తూ ఏటా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న పీఎంపీల సేవలు అభినందనీయమని చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ అన్నారు. పోలీసు అమరల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంపీ అసోసియేషన్ ఉంగుటూరు మండల శాఖ, యర్రమిల్లిపాడు పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 200 మందికి గుండె, కంటి, కీళ్లు, నరాల సమస్యలకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు, ఉప సర్పంచి చిలుకూరి రాజేష్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చెర్లకోట శ్రీనివాస్, బీఎస్‌బీ రాజు, ఉపాధ్యక్షుడు మంగన్న తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న ఎస్సై సూర్యభగవాన్

రీసర్వే గ్రామ సభలో 12 ఫిర్యాదులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: భూముల రీసర్వే లోపాలను గ్రామ సభల ద్వారా సరిదిద్దుకోవాలని సర్వే సహాయ సంచాలకుడు షేక్ మహమూద్ అన్సారీ సూచించారు. రాచూరులో గురువారం భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కరాటం రామకృష్ణ పాల్గొన్నారు. 12 ఫిర్యాదులు అందాయని మండల సర్వేయర్ విశ్వనాథ్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న లారీని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై సతీష్ తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల్లో సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు తరలిస్తుండగా తోటగూడెం వద్ద పట్టుకున్నామన్నారు. లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: గోపినాథపట్నంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై గురువారం దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.6,570 నగదు, 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	లవ్ రెడ్డి
అంబిక మినీ	వెనమ్
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	పొట్టేల్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వెనమ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	లగ్గం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	గ్యాంగ్‌స్టర్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	లవ్ రెడ్డి / జనక అయితే గనక / వెనమ్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	దేవర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పెదవేగి, న్యూస్‌టుడే: ఏలూరులో ఈ నెల 23న జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో పెదవేగి మండలం కొప్పాక, రామసింగవరం ఉన్నత పాఠశాలల క్రీడాకారులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఆర్.శైలజ, టి.వి.పద్మావతి తెలిపారు. క్రీడాకారులను గురువారం ఆయా పాఠశాలల వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

దెందులూరు, న్యూస్‌టుడే: కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రవికుమార్, సత్యసాయి వంశీ, ఏసమ్మలు అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. విద్యార్థులను శర్మ, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ బేడా గణేశ్, పీడీ గవ్వా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



త్రోబాల్ పోటీలకు ఎంపికైన కొప్పాక, రామసింగవరం పాఠశాలల క్రీడాకారులతో ఉపాధ్యాయులు

జూడో పోటీల్లో ప్రతిభ.. ఏలూరు విద్యా విభాగం, ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలో ఈ నెల 21న నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో స్థానిక బీజీటీవో నగర పాలక పాఠశాల విద్యార్థిని టి.శర్వాణి బంగారు పతకం సాధించిందని ప్రధానోపాధ్యాయుడు కేవీ షడ్రక్ తెలిపారు. నవంబరు 14 నుంచి ఒడిశాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపినాథపట్నం శివారు కాలనీలో మోటారు మరమ్మతుకు గురవడంతో అయిదు రోజులుగా స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రోజులు గడుస్తున్నా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి వెళ్లడంతో శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా గురువారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ.. భీమడోలు, న్యూస్‌టుడే: భీమడోలు, గుండుగొలను, కురెళ్లగూడెం, పోలసానిపల్లి గ్రామాలకు చెందిన పలువురు పేదలకు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యావసరాలు, నూతన వస్త్రాలను గురువారం పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు గుల్ల నూకరాజు, జి.రామాంజనేయులు, జి.రమణశంకర్ తదితరులు పాల్గొన్నారు.

27న రౌండ్ టేబుల్ సమావేశం.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: బహుజన రాజకీయ పార్టీలు, సంస్థల ప్రతినిధులు, ప్రముఖుల రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు స్థానిక యాదవ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బహుజనుల ప్రాతినిధ్యంపై సమావేశంలో చర్చించి తీర్మానిస్తామన్నారు.

అవి ఇవి అన్నీ

బాణసంచా స్వాధీనం.. పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే: అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై సతీష్ తెలిపారు. పెదపాడు మండలం ఏపూరులోని ఓ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న రూ.1,56,568 విలువైన బాణసంచాను గుర్తించామన్నారు. నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ● పెదవేగి మండలం ముండూరులో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న బాణసంచాను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన కొనకళ్ల వెంకటకృష్ణ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



మహాన్నప్రసాద వితరణ.. ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రులు పూర్తయిన సందర్భంగా ఏలూరులోని బావిశెట్టివారిపేట కనకదుర్గమ్మ దేవస్థానం వద్ద గురువారం మహాన్నప్రసాద వితరణ చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గోడ పత్రాల ఆవిష్కరణ.. ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏఐటీయూసీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అగ్ర భాగాన నిలిచిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కోటదిబ్బ వద్ద సంఘ ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రాలను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబరు 31న కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించాలని జాతీయ సమితి పిలుపు ఇచ్చిందన్నారు. కె.భరత్, సుబ్బారావు, అప్పారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా.. దెందులూరు, న్యూస్‌టుడే: తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలంటూ దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు గురువారం ధర్నా చేశారు. కార్మికులు ప్లకార్డులు పట్టుకుని పీఎఫ్, అయిదు నెలల జీతాల బకాయిలు చెల్లించాలని నినదించారు.

పోలవరం
•పోలవరం • చింతలపూడి

కార్తిక మాసోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో జరగనున్న కార్తిక మాసోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు ఈవో ఆర్వీ చందన గురువారం అందజేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా చింతలపూడిలోని క్యాంప్ కార్యాలయంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి ప్రదర్శించారు.



ఆహ్వాన పత్రిక ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

పట్టిసీమ గ్రూపు ఆలయాల ఈవోగా సురేశ్‌నాయుడు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారిగా సురేశ్‌నాయుడు బాధ్యతలు స్వీకరించారు. భీమవరం గునుపూడి ఆలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. పట్టిసీమతో పాటు గూటాల లక్ష్మీనరసింహస్వామి, పోలవరం పెద్దరామాలయం, కడెమ్మ అమ్మవారి ఆలయాల నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో పట్టిసీమ ఆలయానికి ఒకరిని, గూటాల, పోలవరం ఆలయాలకు మరోకరిని ఈవోలుగా నియమించారు. దేవాదాయ శాఖాధికారుల వైఖరిని భక్తులు నిరసించినా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. గతంలో పట్టిసీమ ఆలయ ఈవో కొయ్యలగూడెం మండలంలోని ఆలయాలనూ పర్యవేక్షించేవారు. కానీ ప్రస్తుతం వాటిని జంగారెడ్డిగూడెం ఆలయాల పరిధిలోకి మార్చారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌కి చెందిన కంచర్ల మురారావు, జానకి దంపతులు ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఈవో నటరాజారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.



దాతకు నిత్యాన్నదాన పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో నటరాజారావు

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బొర్రంపాలెంలోని సాయిబాబా ఆలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు అభిషేకం, సాయినామ సంకీర్తనలు గానం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

చింతలపూడి, న్యూస్‌టుడే: గుత్తేదారుతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని, సమ్మె విరమించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. అయిదు రోజులుగా చింతలపూడి ఏరియా ఆసుపత్రి వద్ద సమ్మె చేపడుతున్న పారిశుద్ధ్య కార్మికులను ఎమ్మెల్యే గురువారం కలిశారు. జీతం బకాయిలు సంబంధించి గుత్తేదారుతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులకు వచ్చేలా చూస్తానన్నారు. సమ్మె విరమించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ట్రైకార్ ఛైర్మన్‌ను కలిసిన డీఎస్పీ

పోలవరం, న్యూస్‌టుడే: ట్రైకార్ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొరగం శ్రీనివాసులును డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు గురువారం పోలవరంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. ఆయనతో పాటు సీఐ, ఎస్సైలు బాలసురేష్ బాబు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



శ్రీనివాసులుకు మొక్క ఇస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు

సాగునీటి సంఘాలకు పునరుజ్జీవం!

ఎన్నికల నిర్వహణకు సమాయత్తం

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, న్యూస్‌టుడే: మెట్ట మండలాల్లోని సాగునీటి వనరులకు ఎట్టకేలకు జీవం రానుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన సాగునీటి చెరువుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం దృష్టి సారించింది. సుదీర్ఘ విరామం తర్వాత సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

● జలవనరుల శాఖ కొయ్యలగూడెం అప్‌లాండ్ సబ్‌డివిజన్ పరిధిలో బంధకట్టు, ఎర్ర కాలువ సెక్షన్లు ఉన్నాయి. బంధకట్టు సెక్షన్‌లో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, దేవరపల్లి, తాళ్లపూడి, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లోని 265 చెరువుల కింద 20,891 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది.

● ఎర్ర కాలువ సెక్షన్‌లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పరిధిలోని 55 చెరువుల కింద 8,940 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. రెండు సెక్షన్లలో మొత్తం 59 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల పర్యవేక్షణకు ఆయా మండలాల తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు.

కొయ్యలగూడెం సబ్‌డివిజన్ పరిధిలో సంఘాల వివరాలు

సెక్షను	మండలం	సాగునీటి సంఘాలు
బంధకట్టు	కొయ్యలగూడెం	10
	గోపాలపురం	14
	దేవరపల్లి	05
	తాళ్లపూడి	03
	నల్లజర్ల	07
	నిడదవోలు	06
ఎర్ర కాలువ	తాడేపల్లిగూడెం	14



నూతికుంట చెరువు

ఏర్పాట్లు చేస్తున్నాం..

చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలతో ఓటర్ల జాబితాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యామని జలవనరులశాఖ కొయ్యలగూడెం అప్‌లాండ్ సబ్‌డివిజన్ డీఈఈ కె.రవీంద్రకుమార్ తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పోలవరం సబ్ డివిజన్ పరిధిలో..

చిన్నతరహా నీటి పారుదల శాఖ పోలవరం సబ్‌డివిజన్ పరిధిలోని పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో 59 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఈ చెరువుల కింద 17,083 ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వం నీటి పారుదల వ్యవస్థను పట్టించుకోకపోవడంతో కనీసం తూములు మరమ్మతులకు నోచుకోలేదు. గట్ల పరిస్థితి అధ్వానంగా మారింది. పనులన్నీ ప్రతిపాదనలకే పరిమితం కావడంతో అధికారులు ఏ పని చేయలేక అయిదేళ్లు మిన్నకుండిపోయారు. పోలవరంలో అతి పెద్దదైన కొత్తూరు చెరువు తూములు మొత్తం దెబ్బతిన్నాయి. వృథాగా పోతున్న నీటికి గడ్డి, ఇసుక బస్తాలు వేసుకుని రైతులే అడ్డుకోవాల్సిన పరిస్థితి. పోలవరం మండలంలో 8, బుట్టాయగూడెం మండలంలో 21, జీలుగుమిల్లి మండలంలో నీటి సంఘాలకు ఎన్నికలకు నిర్వహించనున్నారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి ఆశ్రమం వీధిలో వరద నీరు ప్రధాన రహదారిపై నిలుస్తున్నాయి. వర్షం తగ్గినా పది రోజుల వరకు నీరు అలాగే నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి. **- రవికుమార్, స్థానికుడు**

సమాధానం: ప్రధాన రహదారిపై వరదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటాం. **- పావని, కమిషనర్, చింతలపూడి**

ఉత్సాహంగా వచ్చి.. బహుమతులు గెలిచి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం విద్యా వికాస్ ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో బి.తేజశ్విని, ద్వితీయ డి.జాన్ సాత్విక్‌రాయ్, తృతీయ వి.కైలాష్ నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ వి.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వి.బాబూరావు, రమేష్, పి.బాబూరావు, బి నయ్, షర్నాబ్ పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు

శిరస్త్రాణం లేని ప్రయాణం ప్రమాదం

చింతలపూడి, న్యూస్‌టుడే: హెల్మెట్ ధరించకుండా ప్రయాణం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. రహదారి ప్రమాదాలు నివారించేందుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని గురుభట్ల గూడెం రహదారి జంక్షన్ వద్ద గురువారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. హెల్మెట్ ధరించకపోవడంతో కలిగే అనార్థాలపై విజయవాడకు చెందిన కళాకారులతో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల రహదారి ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు హెల్మెట్ ధరించకపోవడంతోనే జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్‌లను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. రహదారి భద్రతపై రూపొందించిన కరపత్రాలను అందజేశారు. సీఐ రవీంద్ర, ఎస్సై కుటుంబరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఎస్పీ ఆధ్వర్యంలో..

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి వద్ద జాతీయ రహదారిపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ లేని వారిని జరిమానాలతో శిక్షించడమే కాకుండా వారికి హెల్మెట్ వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఒక వ్యక్తి మృతి చెందితే అతనిపై ఆధారపడి ఉన్న కుటుంబం తీవ్రంగా నష్టపోతుందని, ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్‌బాబు, భీమడోలు ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి సన్మానం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: విప్పలపాడు వద్ద ఉన్న ఏకలవ్య విద్యాలయం సందర్శనకు వచ్చిన ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజులకు బుట్టాయగూడెంలో తెదేపా సీనియర్ నాయకుడు, మండల మాజీ అధ్యక్షుడు నల్లూరి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. తెలుగు మహిళ సీనియర్ నాయకురాలు బబిత హారతి ఇచ్చారు. ఎంపీకి శాలువా కప్పి నాయకులు సన్మానించారు. తెదేపా మండల కార్యనిర్వాహక కార్యదర్శి మాటూరి ముసలయ్య, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు వరకా కృష్ణంరాజు, నాయకుడు పసుమర్తి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

దోమల నిర్మూలనకు చర్యలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టినట్లు కేఆర్ పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్ కుమార్ తెలిపారు. నూతిరామన్నపాలెంలో నీటి నిల్వల్లో గంబూషియా చేప పిల్లల విడుదలను గురువారం ఆయన ప్రారంభించారు. కేఆర్ పురం పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమాధుర్, మలేరియా విభాగపు సిబ్బంది పందిరి శ్రీనివాస్, శ్రీరామరాజు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'జాబితా నుంచి ఇళ్ల తొలగింపు వైకాపా పనే'

వేలేరుపాడు, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసిత గ్రామమైన జగన్నాథపురంలో 335 ఇళ్ల జాబితా నుంచి 140 ఇళ్లను తొలగించిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందని తెదేపా మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సర్వే చేసిన గృహాల జాబితాపై పలు అనుమానాలు రావడంతో పరిశీలించగా.. ఇళ్ల తొలగింపు వ్యవహారం బయటపడిందన్నారు. ఈ విషయాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వనని ఆయన హామీ ఇచ్చినట్లు అశోక్ తెలిపారు. కట్టం రాంబాబు, కొమ్మన వెంకటేశ్వర్లు, శాఖమూరి సంజీవులు, కోటిపల్లి ముత్యాలరావు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

రీ సర్వే సమస్యలు తెలియజేయాలి.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: భూ రీ సర్వేలో సమస్యలుంటే రైతులు తెలియజేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య అన్నారు. 100 రామన్నపాలెంలో గురువారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. అర్జీ ఇచ్చిన 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ సత్యసాయిబాబాకు 33 మంది రైతులు అర్జీలను అందజేశారు.

జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా రమణ.. ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ఆర్డీవోగా ఎంవీ రమణ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీవోగా కె.అద్దయ్య వ్యవహరిస్తున్నారు. ఈయనను ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అభిమన్యుడికి నివాళులు.. పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని పట్టిసీమలో విద్యావేత్త, అభ్యుదయవాది దాకే అభిమన్యుడి వర్ధంతిని గురువారం నిర్వహించారు. ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఎంపీపీ ఎస్.వెంకటరెడ్డి, గోపాలపురం మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అభిమన్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురికి దాకే సుధీర్‌బాబు నూతన వస్త్రాలు అందజేశారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం డిపో నుంచి కార్తిక మాసంలో ప్రతి ఆదివారం పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం గంగాధరరావు తెలిపారు. నవంబరు 3, 11, 17, 24 తేదీల్లో రాత్రి 8.45 గంటలకు ఈ బస్సులు జంగారెడ్డిగూడెం బస్టాండ్ నుంచి బయలుదేరతాయన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ క్షేత్రాలకు యాత్రికులను తీసుకెళ్తాయన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించండి.. చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: పొట్ట దశలో ఉన్న వరి పంటలకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని చింతలపూడి వ్యవసాయ శాఖ ఉప సంచాలకుడు నాగకుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చింతలపూడి డివిజన్ పరిధిలోని చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం, టి.నరసాపురం మండలాల్లో 25,424 వేల ఎకరాల్లో వరి పంట రైతులు సాగు చేశారన్నారు. ప్రస్తుతం కంకి వచ్చే దశలో ఉన్నందున తెల్ల కంకులు రాకుండా అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలన్నారు.

మహిళలకు ఉచిత బస్సు సర్వీసు కల్పించాలని ఆందోళన.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ అమలులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జంగారెడ్డిగూడెంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎలీజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత.. జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: నిమ్మలగూడెంలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన కంకిపాటి నాగరాజు కుటుంబానికి మానవత ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రూ.15,500 ఆర్థిక సహాయం, 175 కేజీల బియ్యం అందించారు. వివరాలను మానవత ప్రతినిధి గద్దె సత్యనారాయణ తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ.. టి.నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి జన్మదినం సందర్భంగా కేతవరంలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శ్రీరామమూర్తి గత 40 ఏళ్లుగా రాజకీయాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం విశేషమన్నారు. రామకృష్ణ గౌడ్, బొంతు సత్యనారాయణ, వీరేశలింగం పాల్గొన్నారు.

'జనసేనకు 50 శాతం పదవులు ఇవ్వాలి'

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జనసేన పార్టీకి 50 శాతం నామినేటెడ్ పదవులు వచ్చేలా చూడాలని పలువురు నాయకులు డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబును కోరారు. జనసేన నాయకుల ఆత్మీయ సమావేశం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం జరిగింది. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కరాటం రాంబాబు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. నాయకుల అభీష్టాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వలవల తాతాజీ, షేక్ పీరు, గురుజు ఉమామహేశ్వరి, ఆకుల రాకేశ్, నరేష్, చీదరాల మధుబాబు, షేక్ వలి, చింతల నాని, ఉక్కుర్తి సీతారాం, తిరుమలశెట్టి రవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంబాబు

అభివృద్ధికి నోచక.. అధ్వానంగా మారి!

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే

బుట్టాయగూడెం మండలం రామారావుపేట సెంటర్ నుంచి పందిరిమామిడిగూడెం వెళ్లే రహదారి దుస్థితి అధ్వానంగా మారి వాహనచోదకులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గోతులమయంగా ఉండటంతో దాటి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సూరప్పవారిగూడెం, నాగులగూడెం, అంతర్వేదిగూడెం, పందిరిమామిడిగూడెం గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. జంగారెడ్డిగూడెం నుంచి శ్రీనివాసపురం మీదుగా కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే భక్తులు ఇటుగానే వెళ్లాలి. మారుమూల మోతుగూడెం, కామవరం, కొర్సావారిగూడెం, వేపులపాడు, బూరుగువాడ గ్రామాల ప్రజలు జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు ఇదే దగ్గరి మార్గం. ఆర్అండ్‌బీ పరిధిలోని రహదారి గత అయిదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురైంది. గత ప్రభుత్వం ప్రాధాన్యత లేని రహదారిగా చూపి నిధులు మంజూరు చేయలేదని ఆరోపణలున్నాయి.



సూరప్పవారిగూడెం సమీపంలో గోతులమయంగా రహదారి

తరచూ ప్రమాదాలు

ఈ రహదారిలో ఉన్న గోతులు చిన్నపాటి వర్షానికి కూడా నిండి వాహన చోదకులకు కనిపించక అదుపు తప్పి పడిపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునేందుకు వీలు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా రహదారి అభివృద్ధి చేసి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రూ.7.30 కోట్ల అంచనాతో 11 కిలోమీటర్ల మేర తారు రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ డీఈ హరికృష్ణ తెలిపారు. మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు.

నరికారు.. వదిలేశారు

బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో కొత్తగా వేసే విద్యుత్తు లైన్ల కోసం రహదారి పక్కనున్న చెట్ల కొమ్మలను విద్యుత్తు సిబ్బంది రెండ్రోజుల కిందట నరికారు. నేటికి ఆ కొమ్మలను తొలగించలేదు. అసలే ఇరుకు రహదారిలో ఆ కొమ్మలు వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. అక్కడే ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పంచాయతీలో ఉపాధి హామీ పథకం, సామాజిక అటవీ వన సంరక్షణలో భాగంగా విద్యుత్తు లైన్లు కింద చెట్లు నాటారు. ఏటా వారు నాటుతుంటే వీరు నరుకుతుంటారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, టి.నరసాపురం**



అందుబాటులో నట్టల నివారణ మందులు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: గొర్రెల్లో నట్టల నివారణకు మందులు పంపిణీ చేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గొర్రెల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి పశుగణన: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి 24వ అఖిల భారత పశు గణన ప్రారంభం అవుతుందని పశు వైద్యాధికారి కోటేశ్వరరావు తెలిపారు. ఇంటికి వచ్చే విషయ సేకరణదారులకు పశువుల వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

తాగునీటి పైపులైను నిర్మాణ పనులు ప్రారంభం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పరింపూడి పంచాయతీలో తాగునీటి పైపులైను నిర్మాణ పనులను సర్పంచి ముప్పిడి విజయకుమారి గురువారం ప్రారంభించారు. సుమారు రూ.55 లక్షల అంచనా వ్యయంతో 8 వేల మీటర్ల పొడవునా పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఉపసర్పంచి సంకు కొండ, కూటమి నాయకులు జ్యేష్ఠ రామకృష్ణ, మాదేపల్లి శ్రీనివాస్, గోపాల్, సామాజిక కార్యకర్త చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ విద్యుత్తు లైన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి, రేచర్ల విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చింతలపూడి విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రేచర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్తు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఫీడర్ పనుల నిమిత్తం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. శాలిపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సుబ్బారెడ్డికాలనీ, అశ్వారావుపేట రోడ్డు, ఉప్పలమెట్టతోపాటు దీని పరిధిలోని వ్యవసాయ సర్వీసులకు కరెంటు ఉండదన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన రాజవరం విద్యార్థులు



కొయ్యలగూడెం విద్యార్థి నాగబాబు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఎంపికల్లో రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అయిదుగురు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బి.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో ఎస్.పూజిత, బాలుర విభాగంలో నంద కిశోర్, జి.హేమంతకుమార్, జి.అఖిల్‌కుమార్, అండర్-14 విభాగంలో ఎన్.గణేష్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికవడంతో విద్యార్థులు, శిక్షకుడు శ్రీనివాసరావును పలువురు అభినందించారు. ● అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కొయ్యలగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.నాగబాబు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థిని, పీడీ సుధాకర్‌ను ఆమె అభినందించారు.

ఫెన్సింగ్‌లో...

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ (కత్తి యుద్ధం) పోటీలకు జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు తెలిపారు. డిగ్రీ విద్యార్థినులు ఎం.కీర్తి, ఎం.నాగతులసి, ఎస్.కార్తీక్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులతో పాటు పీడీ వినయ్‌ని ప్రిన్సిపల్ అభినందించారు.



క్రీడాకారులతో ప్రిన్సిపల్ ప్రసాద్‌బాబు తదితరులు

యువకుడి అదృశ్యం.. పోలీసుల గాలింపు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో యువకుడు అదృశ్యమవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కామవరపుకోట మండలం ఆడమిల్లికి చెందిన ఎస్.వినోద్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల కిందట అత్తగారి గ్రామమైన జి.కొత్తపల్లి వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినోద్ కుమార్‌కు చెప్పులు, ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్థానిక ఊర చెరువు గట్టు మీద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. భీమడోలు సీఐ విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ గురువారం రాత్రి చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆ చెరువులో దూకి ఉంటాడన్న అనుమానంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు.

వివాహిత.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వివాహిత అదృశ్యంపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన ఓ మహిళకు అదే గ్రామానికి చెందిన రాజుతో వివాహమైంది. అయితే గత కొద్ది కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 21న వివాహిత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై ఆమె సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ భీమశేఖర్ తెలిపారు.

సారా తయారీ స్థావరంపై దాడి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పాత రాజానగరం సమీపంలో సారా తయారీ స్థావరంపై దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తెలిపారు. బెల్లపు ఊట, సామగ్రిని ధ్వంసం చేసి, 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. కొయ్యలగూడెంలోనూ ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మత్తులో దుకాణానికి నిప్పు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కిళ్లీ దుకాణానికి నిప్పంటించిన వ్యక్తిని లక్కవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. స్టేషన్ రైటర్ శ్రీనివాస్ కథనం మేరకు.. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన చిట్టిబొమ్మ నాగేశ్వరమ్మ స్థానికంగా కిళ్లీ దుకాణాన్ని నడుపుతున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన దల్లి సాయి పూటుగా మద్యం తాగి బుధవారం అర్ధరాత్రి దుకాణానికి నిప్పంటించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

జంగారెడ్డిగూడెం పట్టణం, చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణ శివారు పేరంపేట రోడ్డులో ద్విచక్ర వాహనంపై మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు. అతడి వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ● కామవరపుకోట మండలం తడికలపూడి, కేఎస్ రామవరం, జీలకర్రగూడెం గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు సీఐ అశోక్ గురువారం తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి 52 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

'ఈ' పంట నమోదు జాబితా విడుదల



జాబితా చూసుకుంటున్న రైతులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని సచివాలయం వద్ద సామాజిక తనిఖీలో భాగంగా ఈ పంట నమోదు జాబితాను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్ మాట్లాడుతూ రైతులు సాగుచేసే ప్రతి పంటకు సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

కోదండ రామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలో ట్రిపుల్ ఐటీ సమీపంలోని కోండడ రామాంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్య నృత్య సంగీత కళాశాల ఆధ్వర్యంలో మోహన్ భక్తి గీతాలు ఆలపించారు. ఆలయ సేవకులు పోలగాని నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా పునర్వసు నక్షత్రం పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు భక్తులకు అన్న సంతర్పణ చేస్తున్నట్లు చెప్పారు. ఇలా గడిచిన 36 వారాలుగా భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు వివరించారు. భక్తుల కోరికలు తీర్చే స్వామి కొంగు బంగారమై విరాజిల్లుతున్నట్లు చెప్పారు.

చెత్త సమస్యకు పరిష్కారం..



చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కామినేని

మండవల్లి, న్యూస్‌టుడే: కైకలూరు నియోజకవర్గానికి స్వాగతం పలుకుతున్న లోకుమూడి చెత్త సమస్యను పరిష్కరించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన నాయకులు అధికారులతో కలిసి చెత్త తరలింపు పనులను ప్రారంభించారు. 'ఈనాడు' దినపత్రికలో పలు మార్లు ఈ సమస్యపై కథనాలు ప్రచురించిన సంగతి విదితమే. దీనిపై కలెక్టర్ వెట్రి సెల్వీ సైతం స్పందించిన సంగతి తెలిసిందే. జగనన్న గ్రీన్ విలేజీ పక్కనే ఏలూరు రోడ్డు బారున పెద్దఎత్తున చెత్తను పోసి తగలబెట్టడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గత వైకాపా పాలకుల వల్లే కైకలూరుకు చెత్తతో చెడ్డపేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛ కైకలూరుగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి దూరంగా నివాసాలు లేని ప్రాంతంలో 2.50 ఎకరాల భూమిని సేకరించి రూ.10 లక్షల వ్యయంతో చెత్తను తరలిస్తున్నట్లు వివరించారు. ఏలూరు రోడ్డు పొడవున కంచెను ఏర్పాటు చేసి మొక్కలు నాటుతామని వివరించారు.

వసతులు సమకూరితేనే కలల విద్య

సమస్యల నడుమ మండవల్లి జూనియర్ కళాశాల

మండవల్లి, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతంలో చదివే విద్యార్థుల విద్య ప్రాథమిక స్థాయితోనే ఆగిపోరాదని 2009వ సంవత్సరంలో మండవల్లిలో 2009 జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. కానీ వసతుల లేమి, రక్షణ లేని కళాశాల పరిసర ప్రాంతాలు, తాగేందుకు నీరు లేకపోవడం వంటి సమస్యలు కళాశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే ఆవరణ మొత్తం చెరువును తలపిస్తోంది.

ఎక్కడి గొంగళి అక్కడే

కళాశాల ఏర్పడి 15 ఏళ్లు గడుస్తున్నా సౌకర్యాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నేటికీ ప్రిన్సిపల్ తప్ప కళాశాలలో ఒక్క పోస్టు కూడా మంజూరు కాకపోవడం దారుణమైన విషయం. కాంట్రాక్టు అధ్యాపకుల బృందమే పాఠాలు బోధిస్తోంది. బోధన సిబ్బంది లేకపోవడంతో బైపీసీ గ్రూపును సైతం రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ మాత్రమే అందుబాటులో ఉన్నాయి..



ప్రహరీ లేకపోవడంతో కళాశాల వద్దకు వస్తున్న పశువులు

మైదానాన్ని మరిచారు..

ఆటలతో ఉల్లాసంగా గడపాల్సిన క్రీడా మైదానం చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పక్కనే ఉన్న ఉన్నత పాఠశాలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులు ఇంటర్‌కు వచ్చేసరికి ఇక్కడ సరైన ప్రోత్సాహం లేక వారి భవిష్యత్తు అర్ధంతరంగా ఆగిపోతోంది. ఆటలు ఆడేందుకు అనుకూలంగా క్రీడా మైదానాన్ని తీర్చిదిద్ది పీఈటీ పోస్టును ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. ఒక పక్క ప్రహరీని ఏర్పాటు చేసినా మరో రెండు వైపుల లేకపోవడంతో రాత్రులు, సెలవు రోజుల్లో కొందరు కళాశాల ఆవరణలోనే మద్యం తాగి సీసాలను పగులకొడుతున్నారు. అలాగే చుట్టుపక్కల నుంచి పెద్దఎత్తున గేదెలు, పందులు వచ్చి కళాశాల పరిసరాలను నాశనం చేస్తున్నాయి.



మండవల్లి బురదతో స్వాగతం పలుకుతున్న జూనియర్ కళాశాల రోడ్డు..

నాయకులు దృష్టికి తీసుకువెళ్లాం..

కళాశాలలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికే నాయకుల దృష్టికి తీసుకువెళ్లాం. చుట్టూ రక్షణ గోడలు లేకపోవడంతో బయట వ్యక్తులు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీనిపై స్థానిక నాయకులు చొరవ చూపి రక్షణ గోడలను నిర్మించేందుకు కృషి చేయాలి.

- రవితేజ, ప్రిన్సిపల్, జూనియర్ కళాశాల, మండవల్లి.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు పోస్ట్ ఆఫీసు వద్ద గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేవలం 4 గంటలు మాత్రమే విధులు నిర్వర్తించే గ్రామీణ డాక్ సేవక్‌లతో పది గంటల వరకు వెట్టిచాకిరీ చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో అధ్యక్షుడు వీవీఎస్ అజరయ్య, కోశాధికారి జి.పార్థసారథి, అన్ని సబ్ పోస్టాఫీసుల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అఖిలభారత పశుగణన ప్రారంభం

మండవల్లి, న్యూస్‌టుడే: అఖిలభారత పశుగణన శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. ఐదేళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా పశుగణన చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల వ్యాధి నియంత్రణ, పశువుల ఆరోగ్యంపై నిఘా, పశువుల ఉత్పత్తి అంచనా, అధ్యయనానికి వీలు పడుతుందన్నారు. మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో పశు గణనకు 26 మంది ఎన్యుమరేటర్లు, అయిదుగురు సూపర్ వైజర్లను నియమించినట్లు తెలిపారు. దీనికి పశువుల యజమానులు తప్పక సహకరించాలని కోరారు.

గోడపత్రాల ఆవిష్కరించిన మంత్రి.. నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: భారత దేశమంతా 21వ పశుగణన అక్టోబర్ 25 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహిస్తారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ పశు గణనకు సంబంధించిన గోడ పత్రాలు, బ్రోచర్లు, స్టిక్కర్లు సూచన పుస్తకాలను ఆయన గురువారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశు గణనలో భాగంగా గణన ప్రక్రియ పూర్తయినట్లు సూచికగా ప్రతి ఇంటి ముందు తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్లు ఉంచుతారని తెలిపారు.

యనమదల పాఠశాలను సందర్శించిన ఎంఈవో

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : నూజివీడు మండలం యనమదలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో-2 జమలయ్య సందర్శించారు. పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. బోధన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో చదువు ఒక్కటే ధ్యేయం కావాలన్నారు.

చెరువు లీజు వివాదంపై దుష్ప్రచారం సరికాదు: కమ్మిలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు కరకట్ట శివారులోని వంద ఎకరాల చెరువు లీజు వివాదంలో కూటమి ప్రభుత్వ పాత్ర ఉందని దుష్ప్రచారం చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నేత కమ్మిలి విఠల్‌రావు అన్నారు. ఈమేరకు స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో రైతులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రస్తుత జిల్లా పార్టీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అప్పటి లీజుదారుడిని భయపెట్టి రైతుల నుంచి తన కుమారుడు, కోడలు పేరిట బలవంతంగా చెరువులను స్వాధీనం చేసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం నెలకొన్న వివాదాన్ని రైతులు, లీజుదారుడు సామరస్యంగా సరిచేసుకోవాలని హితవు పలికారు. ఈ విషయంపై లీజుదారులైన మాజీ ఎమ్మెల్యే, అతని కుమారులు చేపల రైతు సంఘంలో చర్చించుకుందామని చెప్పి రిజిస్టర్ పోస్టులో రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో రైతులు పంజా ఏసుకుమార్, మైగాపుల వెంకటరత్నం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తికి పదును

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు



వ్యాసరచనలో పాల్గొన్న విద్యార్థులు



బహుమతులు పొందిన విజేతలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తుక్కులూరు బాల భారతి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ జి.వెంకట కృష్ణారావు అన్నారు. గురువారం 'అంతర్జాల వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశం మీద వ్యాసరచన పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలురు 60 మంది, బాలికలు 41 మంది పాల్గొన్నారు. ఈ పోటీలను ఉపాధ్యాయులు దాసరి ఝాన్సీ రాణి, జరపల రమేశ్, పురిహెళ్ల వెంకటలక్ష్మి జగదాంబ, జి.వెంకట కృష్ణారావులు పర్యవేక్షిస్తూ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ బహుమతి పదో తరగతికి చెందిన మక్కళ్ల సంజన, ద్వితీయ బహుమతి మలుగు రాఘవేంద్ర రాఘవ కృష్ణ రోహిత్, తృతీయ బహుమతి పదో తరగతికి చెందిన గద్దల ప్రియాంక గెలుపొందారు. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రికి వినతి పత్రం



మంత్రిని కలిసిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ ఏలూరు జిల్లా విభాగం గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని నూజివీడు క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా తాము ఐదు సంవత్సరాల నుంచి గ్రామస్థాయిలో ఎటువంటి ఇంజినీరింగ్ పని జరిగినా పనిచేస్తున్నామన్నారు. పనిభారం అధికంగా ఉంటుందని వారు వాపోయారు. ఇప్పటివరకు తమకు ప్రభుత్వం ప్రమోషనల్ ఛానల్ కల్పించలేదని మంత్రికి తెలియజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ సంబంధిత శాఖలు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు.. నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం నూజివీడు బస్టాండు నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం వరకు కొత్త సూపర్ లగ్జరీ బస్ సర్వీసును గురువారం రాత్రి మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రముఖ పుణ్యక్షేత్రం త్రిపురాంతకం దేవాలయాల సందర్శనకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభించామన్నారు. ఈ సర్వీస్‌ను ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు నూజివీడు నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు ఎర్రగొండపాలెం చేరుతుందన్నారు.

ట్రిపుల్ ఐటీ అధికారుల పరిశీలన

నూజివీడు పట్టణం, న్యూస్ టుడే: నూజివీడు మండల పరిషత్ కార్యాలయాన్ని ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగ బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి సునీల్ భగత్ మాట్లాడుతూ ఎంపీడీవో సూచనల మేరకే మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని సందర్శించడం జరిగిందన్నారు. పూర్తిగా పరిశీలించామని, 68 సంవత్సరాల పురాతన భవనమని తమ బృందం నిర్ధారించినట్లు తెలిపారు. అన్ని విభాగాల అధికారులతో చర్చించి తుది నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్, డీవైఈవో సేవ్యా నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	వీనం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వేట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	మార్టిన్
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	వేట్టయన్
శ్రీవెంకటరమణ సినిమాస్	విశ్వం
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

భార్య కాపురానికి రావడం లేదని మామపై దాడి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని, అందుకు కారణం మామ అని భావించి ఆయనపై దాడి చేసి గాయ పరచిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దేవపూడికి చెందిన మట్లపూడి కనకారావు కుమార్తె నాలుగేళ్ల క్రితం భర్త బాలాజీపై 498ఏ కేసు పెట్టింది. ఈ నేపథ్యంలో ఈనెల 20న కనకారావు ఇంటి వద్ద గేదెలకు నీరు పెడుతుండగా అల్లుడు బాలాజీ వచ్చి 'నా భార్య నీవల్లే కాపురానికి రావడం లేదని' దాడి చేయడంతో పాటు నోటితో కొరికి గాయపరిచాడు. క్షతగాత్రుడిని గుడివాడ ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు గురువారం ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం కొల్లేరులో వేటకు వెళ్లి బుధవారం ప్రమాదవశాత్తు పడి గల్లంతైన ఘంటసాల అంతిర్వేది మృత దేహం గురువారం లభ్యమయ్యింది. ఉదయం నుంచి స్థానిక మత్స్యకారులు పెద్దఎత్తున కొల్లేరులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని కనుగొన్నారు. అంతిర్వేది మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతిగా రూరల్ సీఐ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రీ సర్వేలో అన్నీ తప్పులే..



కొత్రగుంటపాలెంలో తహసీల్దారుకు అర్జీ అందిస్తున్న రైతు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గతంలో భూ రీ సర్వే తప్పులతడకగా సాగిందని రైతులు తహసీల్దారు జె.సుభానీకి ఫిర్యాదు చేశారు. కొత్రగుంటపాలెం, దేవపూడి, ప్రొద్దువాకలో గురువారం గ్రామ సభలు నిర్వహించి 46 అర్జీలను స్వీకరించారు.

కలిదిండి, న్యూస్‌టుడే : రీ సర్వేలోని సమస్యలను పరిష్కరించడానికే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు రామకృష్ణ తెలిపారు. కొచ్చెర్లలో గురువారం రీ సర్వే సభ నిర్వహించారు. ఆర్.ఐ. శ్యామల పాల్గొన్నారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: రీ సర్వే గ్రామ సభలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఎం.ప్రశాంతి కోరారు. చాట్రాయి మండలం చిత్తపూర్‌లో గురువారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు.

ముసునూరు, న్యూస్‌టుడే: రీ సర్వేలో నమోదైన తప్పులను సవరించుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రైతులకు చక్కని అవకాశమని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శర్మ అన్నారు. గోపవరంలో గ్రామసభ నిర్వహించి 125 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కరించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం కలటూరులో గురువారం గ్రామ సభ నిర్వహించారు. దీనిలో 91 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు.

జీతాల బకాయిలు విడుదల చేయాలని నిరసన



ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాశ్ డిమాండ్ చేశారు. నూజివీడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్, హాస్పిటల్ సెక్యూరిటీల సమావేశం నిర్వహించి అనంతరం ఆసుపత్రి మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

దాతల ఆర్థిక సాయంతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు



కృత్రిమ అవయవాలు అమర్చిన వారితో హీల్ ప్రతినిధులు, దాతలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అవయవాలు కోల్పోయిన వారికి దాతల ఆర్థిక సాయంతో కృత్రిమ అవయవాలు అమరిక ద్వారా కొత్త జీవితం ఇవ్వడం అభినందనీయమని హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కోనేరు సత్య ప్రసాద్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో కాకర్ల శంకరరావు, వల్లూరి తాతారావు, రాజ్యలక్ష్మి, దోనేపూడి రాధికల ఆర్థిక సాయంతో ఐదుగురికి గురువారం కృత్రిమ కాళ్లను అందజేశారు. కృత్రిమ కాళ్లకు ఆర్థిక సాయం అందించిన దాతలను ఆయన అభినందించారు. హీల్ సీఈవో కె.అజయ్ కుమార్, హీల్ యూకే ప్రతినిధి జూలీ, పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.సి.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మేలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సకాలంలో తెగుళ్లు, పురుగులు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, వాటిని నివారించుకోవాలని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. కోడూరులో గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధిగా భూసార పరీక్షలు చేయించుకొని సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలని సూచించారు. పశువైద్యాధికారి క్రాంతికుమార్ మాట్లాడుతూ పశు కిసాన్ క్రెడిట్ కార్డు సౌకర్యాన్ని రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. నట్టల నివారణకు ఉచితంగా అందిస్తున్న మందులను జీవాలకు వేయించాలని సూచించారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సతీశ్ మాట్లాడుతూ చేపల చెరువులు ఉన్న రైతులందరూ తక్షణమే లైసెన్సులు తీసుకొని క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.

10 మంది జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండలం అడవి నెక్కలం సమీపంలో గురువారం పోలీసులు జరిపిన దాడుల్లో జూదం ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,100, 11 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాల తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ పరిధిలోని 10 కళాశాలల నుంచి సుమారు 60 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు నవంబరు 6న అమృతసర్‌లో నిర్వహించే అంతర్ కళాశాల పోటీల్లో పాల్గొంటారని కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.శివనాగరాజు తెలిపారు. అంతకు ముందు కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఉదయ్ ప్రకాశ్, పలువురు అధ్యాపకులతో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు.

అమరవీరుల త్యాగాలు వెలకట్ట లేనివి



మండవల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రవికుమార్, సిబ్బంది, గ్రామస్థులు

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజల శ్రేయస్సు కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్ట లేవని గ్రామీణ సీఐ వి.రవికుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసు సిబ్బంది, గ్రామస్థులతో కలిసి మండవల్లి పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్సై సీహెచ్‌ఎస్ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు. ✧ పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు గ్రామీణ ఎస్సై పి.రాంబాబు ఆధ్వర్యంలో మండలంలోని ఆలపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సమాజంలో పోలీసుల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

అవి ఇవి అన్నీ

అధికారులను కలిసిన భాజపా నాయకులు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు జె.సుభానీ, ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ, ఎస్సై వీరభద్రరావును గురువారం మండల భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందించి అభినందనలు తెలిపారు. మండలంలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లగా అధికారులు సానుకూలంగా స్పందించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ, సత్యవోలు నాగలక్ష్మి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ.. ముసునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న నట్టల నివారణ మందును పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా గ్రామ అధ్యక్షుడు చల్లగుళ్ల మల్లిబాబు అన్నారు. గురువారం ముసునూరు మండలం సూరేపల్లిలో 1,478 గొర్రెలు, 150 మేకలకు నట్టల నివారణ మందును పశు వైద్యుడి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

ఖాళీగా ఏపీఎం పోస్టు.. రుణాలకు అవస్థలు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి వెలుగులోని ఏపీఎం పోస్టు భర్తీ కాకపోవడంతో డ్వాక్రా సంఘాల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పలువురు సీసీలు మారారు. అలాగే గత కొన్ని నెలలుగా కైకలూరు ఏపీఎం బి.సత్యనారాయణ ఇక్కడ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నెలరోజుల క్రితం ఆయన ఇక్కడ నుంచి రిలీవ్ కావడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ప్రస్తుతం డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు గేదెల పెంపకం, వివిధ వ్యాపారాలు నిర్వహించుకోవడానికి బ్యాంకులు ద్వారా రుణాలు ఇస్తున్నారు. ఏపీఎం లేకపోవడంతో పలు బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఏపీఎం పోస్టు భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక.. చాట్రాయి, న్యూస్‌టుడే: యూటీఎఫ్ చాట్రాయి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ రఘు, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడిగా జె.చంటి, సహాధ్యక్షులుగా వాణి మాధవి, జి.వెంకట్రావు, కోశాధికారిగా జి.సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శులుగా వి.హరీశ్, స్వర్ణకుమారి, బి.వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్‌గా పెద్ద రమేశ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నాయకులు కె.గాంగేయుడు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతరంతోనే సమాజంలో మార్పు.. కైకలూరు, న్యూస్‌టుడే: దేశ భవిష్యత్తు యువతరంపై ఆధారపడి ఉందని ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించడంతోనే సమాజంలో మార్పు వస్తుందని ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం అన్నారు. రాష్ట్ర కళాశాలల కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెవెన్యూ, కళాశాలల సంయుక్తంగా ఓటు నమోదు, వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పూడిక తీత పనులు ప్రారంభం



పనులు పర్యవేక్షిస్తున్న తెదేపా నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరులో తెదేపా సర్పంచి కొండేటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లో పూడిక పేరుకుపోయింది. దీనివల్ల దోమల బెడద అధికంగా ఉంది. అంతేగాక రోజులు తరబడి నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. మురుగు సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా గురువారం ఆమె స్పందించి యంత్రంతో అన్ని వీధుల్లో పూడిక తీత పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విస్తరణ పనుల గుంతలో లారీ బోల్తా



లారీని తీస్తున్న క్రేన్

కైకలూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 165లో అడ్డదిడ్డమైన విస్తరణ పనులు కారణంగా ఊక లారీ బోల్తా పడి డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన ఇది. బుధవారం అర్ధ రాత్రి ఆకివీడు నుంచి కైకలూరు మండలం ఆటపాకకు ఊక లోడుతో లారీ బయలుదేరింది. కైకలూరు మండలం సింగాపురం వద్దకు వచ్చే సరికి విస్తరణ పనులకోసం తవ్విన గుంతలో అదుపు తప్పి ఒక్కసారిగా బోల్తా కొట్టింది. పోలీసులు లారీని క్రేన్ సహాయంతో బయటకు తీశారు.